నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఫలక్ నుమా సీబీడీ ఏఈఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. అలియాబాద్ విద్యుత్ పరిధిలోని అలియాబాద్, షంషీర్ గంజ్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఫూల్‌బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని అహ్మద్‌కాలనీ, మినర్వా మజీద్, కుమార్ వాడి, ఫూల్‌బాగ్, బాహర్ ఫంక్షన్ హాల్, నిమ్రా కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సీబీఎఫ్‌సీ అడ్వైజరీ ప్యానల్ బోర్డు సభ్యుడిగా రాకేష్ జైస్వాల్



సుల్తాన్‌బజార్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా గౌలిగూడకు చెందిన బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సీబీఎఫ్‌సీ రిజినల్ అధికారి శిఫాలికు మార్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. సీబీఎఫ్‌సీ నియమ నిబంధనలకు అనుకూలంగా వ్యవహరిస్తానని రాకేష్ జైస్వాల్ తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన సీబీఎఫ్‌సీ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఎగ్జిబిషన్‌లో టీ హబ్ ప్రారంభం



అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో టీ హబ్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, టీ హబ్ సీఈఓ సుజిత్ జాగిర్దార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, కన్వీనర్ చంద్రశేఖర్, అడ్వైజర్ ఆదిత్య మార్గం, జాయింట్ కన్వీనర్ శ్రీనివాస్, దీప్తీ రెడ్డితో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్‌కోర్ట్ ప్రారంభం



అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో ఫిష్ ఫుడ్‌కోర్ట్‌ను తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ప్రారంభించారు. శుక్రవారం రాత్రి పలు రకాల చేప వంటకాలతో కూడిన ఫుడ్‌కోర్ట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..20 రకాల ఫిష్ వంటకాలు సందర్శకులకు అందుబాటులో ఉంటాయన్నారు. చేపలు తినడం ద్వారా మనిషి పటిష్టంగా, ఆరోగ్యకరంగా ఉంటారని పేర్కొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ దుకాణాల వేలానికి అనుమతి ఇవ్వాలి



చార్మినార్: ఇప్పటికే ప్రభుత్వం ద్వారా జరిగిన వేలంలో దుకాణాలు పొందిన కిరాయిదారులు ఏడాదిన్నర గడిచినా నెలనెలా కిరాయి ఇవ్వనందున తిరిగి వేలం వేసేందుకు అనుమతించాలని కోరుతూ పిల్లి గుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం జీహెచ్‌ఎంసీ హౌసింగ్ ప్రాజెక్టు డివిజన్–1 ఇంజినీరింగ్ అధికారులను కోరింది. ఈ మేరకు మళ్లీ ఓపెన్ యాక్షన్ (వేలం) నిర్వహించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించినట్లు ప్రతినిధుల బృందం అధికారులకు వివరించింది. అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్, కోశాధికారి పిల్లి రాంచందర్ తదితరుల బృందం అసోసియేషన్ తీర్మానించిన కాపీతో పాటు వినతిపత్రాన్ని ఏఈ మహేష్‌కు అందజేశారు.

అన్నదానం



గోల్కొండ: నానల్‌నగర్‌లోని ప్రభుత్వ అంధుల హాస్టల్‌లో బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాస్టల్‌లో అంధ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు




శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ప్రార్థనల్లో ముస్లింలతో పాటు మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాల పాల్గొన్నారు. శుక్రవారం సామూహిక ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆటలాడేదెలా..?



పాడైపోయిన గ్రౌండ్ పిచ్



మూతపడిన ఇండోర్ స్టేడియం

- నిరుపయోగంగా విక్టరీ ప్లే గ్రౌండ్
- ఆకతాయిలకు అడ్డాగా మారిన మైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- క్రీడలను ప్రారంభించాలని కోరుతున్న క్రీడాకారులు



ప్లే గ్రౌండ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

సుల్తాన్‌బజార్: గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఎంతో పేరొందిన చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కడ క్రీడలు ఆగిపోయాయి. ఈ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ, స్పోర్ట్స్ అధికారుల నిర్లక్ష్యంతో రెండేళ్లుగా మూతపడడంతో క్రీడాకారులకు ఇక్కడ ప్రాక్టీస్ లభించడం లేదు. ప్రతిరోజూ ఉదయం నుంచి క్రీడాకారులతో కళకళలాడే ఈ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఎలాంటి క్రీడలు జరగకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో సైతం అసాంఘిక కార్యక్రమాలు ఇక్కడ యథేచ్ఛగా కొనసాగుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఈ గ్రౌండ్ కేవలం ప్రైవేట్ వ్యక్తులు ఉపయోగించుకునే ఈవెంట్లకు మాత్రమే పనికి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా సమ్మర్ క్యాంపులు లేవు..

ఎంతో అట్టహాసంగా ఈ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో సమ్మర్ క్యాంపుల ప్రారంభం..ముగింపు కార్యక్రమాలను నగర మేయర్, కార్పొరేటర్లతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇతర ప్రముఖులతో నిర్వహిస్తుంటారు. అయితే రెండేళ్లుగా క్రీడలకు చెందిన ఎలాంటి యాక్టివిటీ ఇక్కడ జరగకపోవడంతో సమ్మర్ క్యాంపులకు కూడా దిక్కులేకుండా పోయింది. దీంతో ప్లే గ్రౌండ్ నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా ఈ ప్లే గ్రౌండ్‌ను అధికారులు క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు.

లాకర్‌గా మారిన ఇండోర్ స్టేడియం..

చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం ఒకప్పుడు దాదాపు 15 ఇండోర్ గేమ్‌లతో కళకళలాడేది. ప్రతిరోజూ 200 మంది క్రీడాకారులు ఇక్కడ ఇండోర్ గేమ్స్‌లో శిక్షణ పొందేవారు. అయితే ఇటీవల కాలంలో అధికారులు ఈ ఇండోర్ స్టేడియంలో ఎన్నికల ఈవీఎంలు, ప్రజాపాలన దరఖాస్తులు భద్రపరుస్తుండడంతో ఔత్సాహిక క్రీడాకారులకు నిరాశ మిగులుతోంది. గత ఉమ్మడి ప్రభుత్వంలో జపాన్ టెక్నాలజీతో ఈ ఇండోర్ స్టేడియాన్ని రూపొందించి క్రీడలను ప్రోత్సహించింది. ఈ స్టేడియంలో శిక్షణ పొందాలంటే క్రీడాకారులు ఎంతో గర్వంగా ఫీలయ్యేవారు. కానీ ఇప్పుడు ఇది కేవలం ఓ ప్రభుత్వ లాకర్‌గా మారిపోయింది.

జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేసిన గ్రౌండ్ ఇదే..

జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసిన ఘనత ఈ విక్టరీ ప్లే గ్రౌండ్‌కు ఉంది. ఇక్కడ క్రీడలు అభ్యసించిన క్రీడాకారులు ఎన్నో అవార్డులు, రివార్డులు పొందడంతో పాటు కోచ్‌లుగా, ప్రభుత్వ అధికారులుగా తీర్చిదిద్దబడ్డారు. ఈ గ్రౌండ్‌లో క్రీడాశిక్షణ బంద్ కావడంతో ఎంతో మంది క్రీడా ఔత్సాహికులు ప్రైవేటు గ్రౌండ్స్‌కు వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ క్రీడలను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

గ్రౌండ్స్‌లో పత్తాలేని అధికారులు..

ఈ గ్రౌండ్‌లో క్రీడల నిర్వహణ కోసం ఓ డైరెక్టర్ స్థాయి అధికారి ప్రతిరోజూ పర్యవేక్షిస్తుండేవారు. అయితే రెండేళ్లుగా ఈ ప్లే గ్రౌండ్‌లో ఎలాంటి క్రీడలు జరగకపోవడంతో ఇక్కడ ఏ అధికారి కనిపించే పాపాన పోవడం లేదు. కనీసం కోచ్‌లు అయినా ఇక్కడ వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అయితే ప్రజాపాలన దరఖాస్తు కోసం ఓ వాచ్‌మెన్ మాత్రం ఇక్కడ అందుబాటులో ఉండడం కొసమెరుపు.

రెయిన్‌బజార్‌లో ఎమ్మెల్యే పర్యటన



బస్తీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. శుక్రవారం రెయిన్‌బజార్ డివిజన్‌లోని సాదత్ నగర్, ఈస్ట్ చంద్రనగర్ ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రజ సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఈఈ ఏకాంబరం, ఏఈ అన్సారీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా హజ్రత్ అలీ జయంత్యుత్సవాలు



సాక్షి, సిటీబ్యూరో: హజ్రత్ అలీ జయంత్యుత్సవాలను శుక్రవారం షియా ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ.. హజ్రత్ అలీ తన చివరి గడియ వరకు ధర్మశాస్త్ర రక్షణ కోసం జీవితం అంకితం చేశారని, ఆయన జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నగరం ఏర్పాటు నుంచి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. యాకుత్‌పురా మౌలాకా చిల్లా, డబీర్‌పురా బిబికా అలావా, బర్గాయే హజ్రత్ అబ్బాస్, యూసుఫ్‌గూడ ఆషూర్‌ఖాన, హుస్సేనీ ఆలం ఆషూర్‌ఖాన, ఎంఎం పహాడీ ఆషూర్‌ఖాన, రైన్‌బజార్ ఇమామ్‌బాడ, పాతబస్తీలోని వివిధ ప్రాంతాల్లో గుర్రాలు, ఒంటెలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన

జియాగూడ: గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్వాన్ కాంగ్రెస్ నాయకులకు కాకుండా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులకు స్థానం కల్పించడం శోచనీయమని గ్రేటర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకారం ఉండడంతో స్థానిక కార్వాన్ కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటారన్న సమాచారంతో ముందు జాగ్రత్త చర్యగా ఉదయం వారి ఇళ్ల వద్ద ముందస్తు అరెస్ట్ చేసి టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కార్వాన్‌లో ఉన్నప్పటికీ కార్వాన్ కాంగ్రెస్ నాయకులలో ఒక్కరికి కూడా పాలక మండలిలో స్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో పార్టీ గుడిమల్కాపూర్ అధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్, ఖైరతాబాద్ డిస్ట్రిక్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ గౌడ్, కార్వాన్ మహిళా అధ్యక్షురాలు మామిడి మాధవి, బీ-బ్లాక్ అధ్యక్షులు చంటి బాబు, గ్రేటర్ కాంగ్రెస్ సెక్రెటరీ ఆకుల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శంకర్, సీనియర్ నాయకులు ఉన్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ షురూ



సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్లకు చక్కని వేదికగా నిలుస్తున్న క్షేమా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఐదో సీజన్ ఘనంగా ప్రారంభమైంది. గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ వేదికగా తొలి రోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 12 జట్ల నుంచి 120 మంది గోల్ఫర్లు టోర్నీలో పాల్గొంటున్నారు. స్వింగ్ కింగ్స్ , రఫ్ రైడర్స్ , ట్యూటోరూట్, సిమేట్రిక్ గోల్ఫర్స్ , మావేరిక్స్ , టీమ్ మైసా, టీమ్ ఆల్ఫా, కళింగా వారియర్స్ , యాంగ్రీ బర్డ్స్ , కాంటినెంటల్ వారియర్స్, ఎంవైకే స్ట్రైకర్స్, ఎగిల్ డర్టీ డజన్ టీమ్స్ ఈ సీజన్ లో పోటీ పడుతున్నాయి. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్, గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కోర్స్, ఊటీ గోల్ఫ్ కోర్సు వేదికగా లీగ్ జరగనుంది. వియత్నాంలోని కింగ్స్ ఐలాండ్ గోల్ఫ్ కోర్సులో ఫైనల్స్ జరగనున్నాయి. ప్రతీ సీజన్ కూ గోల్ఫర్స్ నుంచి స్పందన పెరుగుతూ రావడం సంతోషంగా ఉందని లీగ్ కమీషనర్ డీఎస్ సుమంత్ చెప్పారు.

సంతాన సాఫల్య కేంద్రానికి విశేష స్పందన



వివరాలు వెల్లడిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి

దూద్‌బౌలి: పేట్ల బురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కొత్తగా ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రం (ఐవీఎఫ్) ద్వారా చక్కటి ఫలితాలు వస్తున్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీరెడ్డి స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ముగ్గురు మహిళలకు సంతానయోగం కలిగిందన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆమె విలేకర్ల సమావేశంలో వివరించారు. ఆస్పత్రిలోని సంతాన సాఫల్య కేంద్రంకు 20 మంది వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోగా అందులో శంషాబాద్, నారాయణఖేడ్, పాతబస్తీకి చెందిన ముగ్గురు మహిళలకు మూడు నెలల చికిత్స అనంతరం విజయవంతమైనట్లు ఆమె వివరించారు. సంతానం లేని దంపతులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొంది లబ్ధి పొందాలన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ అమృతలక్ష్మి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా అధికారిపై దాడి

కేసు నమోదు


గౌలిపురా: విధి నిర్వహణలోఉన్న మహిళా అధికారిపై దాడికి పాల్పడిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం ..ఫలక్‌నుమా ఆర్.ఎన్.ఎన్.బీ కాలనీకి చెందిన ఆర్. సక్కు బహదూర్‌పురా మండల కార్యాలయంలో స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. కాగా ఈ నెల 16న సక్కు సిబ్బందితో కలిసి నాగులచింత రాజ్‌పాల్‌నగర్‌లో సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా రోడ్డు పక్కన ఇంటి నిర్మాణం చేపడుతున్న రందం భాస్కర్‌కు పత్రాలు చూపించమని కోరారు. దీంతో యజమాని భాస్కర్ పత్రాలు చూపించడానికి నిరాకరించాడు. అనంతరం శుక్రవారం మధ్యాహ్నం 1.45 గంటలకు సైతం మళ్లీ తనిఖీల నిమిత్తంగా నాగులచింత రాజ్‌పాల్‌నగర్ వద్దకు బహదూర్‌పురా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సక్కు వెళ్లగా భాస్కర్ వాహనం తాళాలను తీసుకొని దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు సక్కు మొఘల్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 27వ తేదీ నుంచి కోల్‌కత్తాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలని ఇంటర్నేషనల్ జిమ్నాస్టిక్ కోచ్ అలికాజో అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ తెలంగాణ రాష్ట్ర ఎస్‌జీఎఫ్ జిమ్నాస్టిక్ పోటీలకు ట్రయల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అండర్–14, 17 విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అండర్–14, 17 విభాగాలలో మెదక్, రంగారెడ్డి జిల్లాల క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో జీవన్‌సింగ్ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పాలక మండలి నిబంధనలను తుంగలో తొక్కిందని ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తాము అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకులు రెండు రోజుల ముందుగానే ప్రకటనలు చేసి నిరసన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఈ విషయం తెలియగానే గుడిమల్కాపూర్ పోలీసులు శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ నాయకుడు టి.జీవన్‌సింగ్‌తో పాటు మొత్తం 42 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి టపాచపుత్ర పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టి.జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ పాలక మండలిలో మహిళలకు స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేశారు.

నేడు సమాలోచన కార్యక్రమం



ఏకు తిరుపతి

చార్మినార్: ఆది పురుషుడు–ఆది ధర్మం అనే మాదిగల పవిత్ర గ్రంథ ఆవిష్కరణ కోసం సమాలోచన కార్యక్రమాన్ని ఈనెల 18న నగరంలో నిర్వహించనున్నట్లు గ్రంథ రచయిత ప్రొఫెసర్ ఏకు తిరుపతి తెలిపారు. సృష్టిలో మాదిగల విశిష్టత, వారి జీవన ప్రయాణం, సామాజిక స్థితిగతులపై సమాలోచన చేయుటకు ఈ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమాలోచన కార్యక్రమాన్ని కొలనుపాక స్వయంభు ఆది జాంబవ మఠం ట్రస్ట్, సాంస్కృతిక అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించను న్నామన్నారు. ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటలకు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో జరిగే ఈ కార్యక్రమానికి మాదిగ కుల సంఘాలు, మేధావులు ఉద్యోగులు, విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గాయపడిన ఓ గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..లక్డీకాపూల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ నెల 11న ఓ గుర్తు తెలియని యువకుడు (30) రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. గాయాలపాలైన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై నీలం రంగు టీ షర్టు, తెలుపు, నీలం రంగు జీన్స్ ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రి సేవా సమితి అధ్యక్షుడిగా రాజకుమార్



రాజకుమార్‌ను సన్మానిస్తున్న సమితి సభ్యులు

జియాగూడ: శివరాత్రి సేవా సమితి అధ్యక్షుడిగా రాజకుమార్ నియమితులయ్యారు. శుక్రవారం రహీంపురాలో శంకరజీ హనుమాన్ జీ ఆలయంలో సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడుతూ..శివ మహా జాగరణ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ సారి 13వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని, ఫిబ్రవరి 26 శివరాత్రి రోజున మహా శివరాత్రి జాగరణ సేవా సమితి ద్వారా రహీంపురా సత్తెన్న గల్లీ శంకరజీ హనుమాన్ జీ కల్యాణ మండపంలో భారీ ఎత్తున జాగరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు నరేష్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, కందుల మోహన్‌గౌడ్, గోవింద్‌రావు, పురుషోత్తం సింగ్, రాంనాథ్, ప్రమోద్ గోపిశెట్టి, దీపక్ సింగ్, బలరాజ్ గౌడ్, బాలకిషన్, జీవన్ ప్రసాద, జగదీష్ వ్యాస్, రాజు, బజరంగ్ సింగ్ పాల్గొన్నారు.

యాకుత్‌పురాలో ముమ్మరంగా రేషన్ కార్డుల సర్వే



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఏసీఎస్ఓ సురేందర్

యాకుత్‌పురా: రేషన్ కార్డుల సర్వేను అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని పౌర సరఫరల శాఖ యాకుత్‌పురా సర్కిల్ ఏసీఎస్ఓ సురేందర్ తెలిపారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర సర్వేలో నూతన రేషన్ కార్డుల కోసం తమ సర్కిల్ పరిధిలో మొత్తం 7935 దరఖాస్తులందయాన్నారు. జీహెచ్‌ఎంసీ సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ల పర్యవేక్షణలో తము, జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాల సమన్వంతో ముగ్గురు చొప్పున సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేపట్టామన్నారు. తమకు అందిన దరఖాస్తుల ప్రకారం ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. సర్వేలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారి వివరాలను ఈ నెల 21 తర్వాత జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయల్లో డిస్‌ప్లే చేస్తామన్నారు.

బంజారి దర్వాజ బస్తీ అభివృద్ధికి కృషి



బంజారి దర్వాజ వాసులతో మాట్లాడుతున్న కౌసర్

గోల్కొండ: బంజారి దర్వాజ బస్తీ, పరిసర ప్రాంతాలను అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుదీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ బంజారి దర్వాజ బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలతో పాటు పలువురు స్థానికులు తమ తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బంజారి దర్వాజా వద్ద ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉంటుందని దీని వల్ల తాము రోడ్డు దాటడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామని పలువురు మహిళలు ఆయనతో మొరపెట్టుకున్నారు. తమ ఇళ్ల ముందు కూడా అక్రమ పార్కింగ్‌లు ఉంటున్నాయని రోడ్డుపై అక్రమ పార్కింగ్‌ల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీ అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయిస్తానని అన్ని ప్రాంతాల్లో వీడీసీసీ రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచడానికి జలమండలి అధికారులతో మాట్లాడుతానన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కోరుతానన్నారు. మజ్లిస్ టోలిచౌకి డివిజన్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, బంజారి దర్వాజా బస్తీ నాయకుడు బాబురావు తదితరులున్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్



సన్మానిస్తున్న కేఆర్.రాజ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఉద్యోగులకు టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. శుక్రవారం టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర నాయకులు ఫిరోజ్ అహ్మద్, ముజాహిద్ అలీలతో పాటు పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ..దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను అంచెలంచెలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రియదేవ్ ఠాకూర్, శ్రీకాంత్, యోగి, చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్, రమేష్, లక్ష్మీపతి, పరమేష్, దామోదర్, రవి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయండి



అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడి ఏఎంఎస్ విధానం రద్దు చేసి ఓపెన్ టెండర్ సిస్టం అమలయ్యేలా చేయాలని ఆయన దానం నాగేందర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే దానం సానుకూలంగా స్పందించి వాటర్‌బోర్డు ఎండీతో మాట్లాడి కాంట్రాక్టర్లకు న్యాయమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతాం



గన్‌ఫౌండ్రీ: రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో మల్లేపల్లి డివిజన్ అధ్యక్షుడిగా పిట్టల చంద్రశేఖర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, నగర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ చంద్ర, ప్రకాష్ సింగ్, ఆవుల నరేష్, మధు, విజయసింగ్, అనురాధ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.